సన్మానం



మద్దూరు మండలం గాగ్గిళ్లాపూర్ గ్రామ యువకులు సకినాల బాలకృష్ణ, బస్వారాజు స్వామి, కనుకంట్ల ప్రశాంత్, తమ్మలపల్లి సంతోశ్‌లను శాలువాతో మంగళవారం సన్మాంచారు. ఇటీవల గ్రామ శివాలయంలో చోరీకి పాల్పడిన దొంగను చాకచక్యంగా పట్టుకొని పోలీసులకు అప్ప గించడం అభినందనీయమని ఎస్‌ఐ షేక్ మహబూబ్ అన్నారు. ఆ మేరకు యువకులను శాలు వాతో సత్కరించారు. - మద్దూరు(హుస్నాబాద్)

క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ఫ్లెక్సీకి మంగళవారం తొగుట మండలం తుక్కాపూర్ గ్రామస్తులు క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు గాను పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయిన కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. - తొగుట(దుబ్బాక)

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బుచ్చిరెడ్డి

సిద్దిపేటరూరల్: ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో నాలుగు పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేసినందుకు గాను సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా వంటి పథకాలను వెంకటాపూర్‌లో అర్హులందరికీ అందించడం చాలా సంతోషకరమన్నారు. తొలుత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మంద పాండు, మాజీ సర్పంచ్ దేవేందర్ రెడ్డి, రాజ్ మహమ్మద్ మండల నాయకులు అంజిరెడ్డి, మల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం: ఐసీడీఎస్

జగదేవ్‌పూర్(గజ్వేల్): బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని వాటిని ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్, బాలల సంరక్షణ అధికారులు భవానీ, రాజు అన్నారు. మంగళవారం మండలంలోని ఇటిక్యాలలో బాల్యవివాహం జరుగుతుందని తెలుసుకున్న వివిధ శాఖల అధికారులు గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్యవివాహం చేసుకుంటే శారీరకంగా, మానసికంగా బాలికలకు ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. చైల్డ్ మ్యారేజ్ నిరోధ చట్టం ప్రకారం బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండిన తర్వాత వివాహం చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం, ఆర్‌ఐ, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): కుల దురహంకార హత్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో దళిత యువకుడు వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి (32)ని కుల అహంకారంతో పరువు హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. దీంతో యువతి వర్గానికి చెందిన వారు అతడిని అమానుషంగా పరువు హత్య చేశారని ఆరోపించారు. నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

శ్రీనివాస్‌కు సత్కారం

మారథాన్‌లో సత్తా



మారథాన్‌లో సత్తా చాటిన శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: మారథాన్ పోటీల్లో సత్తాచాటిన దుబ్బాక మున్సిపల్ ధర్మాజీపేట పాఠశాల ఉపాధ్యాయుడు బోడ శ్రీనివాస్‌ను మంగళవారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. ఇటీవల ముంబయిలో జరిగిన ఆసియా ఖండంలోనే అతిపెద్ద మారథాన్‌లో పాల్గొని సత్తా చాటడం తెలిసిందే. ఆ మేరకు ఆయన పోటీల్లో రాణించడం ఉపాధ్యాయ లోకానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామస్వామి, క్వాలిటీ కోఆర్డినేటర్ భాస్కర్, ధర్మాజీపేట హైస్కూల్ హెచ్‌ఎం సాదత్ అలీ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో బ్యాంక్ ఆర్‌ఎం మృతి



రమేశ్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): గుండెపోటుతో బ్యాంకు రీజినల్ మేనేజర్ కన్నుమూశారు. ధర్మారానికి చెందిన సుంకరి రమేశ్ (38) సిద్దిపేటలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో అగ్రికల్చర్ విభాగంలో రీజినల్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఉద్యోగ రీత్యా సిద్దిపేటలోనే నివాసం ఉంటున్నాడు. మంగళవారం బ్యాంకు విధుల్లో నిమగ్నమైన ఆయనకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. బ్యాంకు సిబ్బంది అప్రమత్తమై ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేలోపే మరణించారు. దీంతో ఆయన స్వగ్రామమైన ధర్మారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య మాధురి, కొడుకు రిషివర్ధన్, కూతురు భువన ఉన్నారు. రమేశ్ అంత్యక్రియలు ధర్మారంలో పూర్తయ్యాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తహసీల్దార్‌గా హరికిరణ్ బాధ్యతల స్వీకరణ

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండల తహసీల్దార్‌గా హరికిరణ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆ స్థానంలో విధులు నిర్వహించిన జయలక్ష్మి మహబూబ్‌నగర్‌కు బదిలీపై వెళ్లారు.

హరీశ్‌రావుకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన ముదిరాజ్ సంఘం సభ్యులు

సిద్దిపేటఅర్బన్: ఎమ్మెల్యే హరీశ్‌రావుకు మంగళవారం బొగ్గులోనిబండలో ఉన్న గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మ దేవాలయానికి రూ.1.20 లక్షల విలువైన గ్రానైట్‌ను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో భైరి నర్సింహులు, భైరి రాజు, అందె బాలయ్య, అందె కనకయ్య, అందె చంద్రం, బఱ్రెంకల బాబు, అందె చంద్రయ్య, అందె నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

చెత్తపై చార్జీ

- ప్రజలపై మోపనున్న భారం
- ప్రణాళికలు సిద్ధం

ఇప్పటి వరకు ఇంటి పన్ను, నీటి పన్నులను ప్రజల నుంచి వసూలు చేసేవారు. కొత్తగా ప్రజలపై చెత్త పన్ను భారం పడబోతోంది. స్వచ్ఛ భారత్ మిషన్ గైడ్‌లెన్స్, సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ 2016 రూల్ ప్రకారం చెత్త సేకరణకు ప్రతీ ఇంటి నుంచి యూజర్ చార్జీలు వసూలు చేసేందుకు మున్సిపల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో 7,533 ఇళ్లు, 86 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. రోజూ ఇళ్ల నుంచి 9 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నారు. ప్రతీ ఇంటికి ప్రతీనెల రూ.50, ప్రతీ దుకాణానికి రూ.300లకు తగ్గకుండా యూజర్ చార్జీలు వసూలు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సూపర్ మార్కెట్, వైన్స్ అండ్ పర్మిట్ రూమ్, బిర్యాని సెంటర్లకు రూ.1,000 చొప్పున పన్నులు విధించబోతున్నారు. సినిమా థియేటర్, బార్ అండ్ రెస్టారెంట్, బేకరికి రూ.2వేల చొప్పున యూజర్ చార్జీలు వసూలు చేయనున్నారు. హాస్పిటల్స్‌కు ప్రతీనెల రూ.3వేలు ఇలా షాపును బట్టి యూజర్ చార్జీలు వసూలు చేసేందుకు మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆదాయ మార్గాలపై ప్రత్యేకదృష్టి

మున్సిపల్ ఆదాయం పెంచుకునేందుకు అధికారులు ఆదాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. గత ప్రభుత్వంలో పట్టణ ప్రగతి కింద మున్సిపాలిటీకి ప్రతీ నెల రూ.27లక్షలు వచ్చేవి. ఈ నిధులతో కార్మికులకు క్రమం తప్పకుండా ప్రతీ నెల వేతనాలు చెల్లించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణ ప్రగతి నిధులకు కోత పెట్టింది. దీంతో కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కార్మికులకు 2 నెలల వేతనాలు బకాయి ఉంది. యేటా మున్సిపల్‌కు పన్నుల రూపేణ రూ.3 కోట్లు రావాల్సి ఉండగా, కేవలం రూ.1.40 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. వచ్చే నిధులు మున్సిపల్ నిర్వహణ, వాహనాల డీజిల్ ఖర్చులు, కార్మికులకు వేతనాలు చెల్లింపులకు సరిపోవడం లేదు. ఖర్చులు ఎక్కువ.. రాబడి తక్కువ. దీంతో ఆర్థిక భారం రోజురోజుకూ పెరుగుతుంది. ఆర్థిక వనరులను సమకూర్చుకునే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. చెత్త సేకరణపై పన్ను విధించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. చాలా మున్సిపాలిటీల్లో అమలవుతుంది. గడిచిన ఐదేళ్లల్లో పాలకవర్గ సభ్యుల నుంచి వ్యతిరేకత వస్తుందని చెత్త సేకరణపై పన్ను ఉసేత్తలేదు. ఈ నెల 26తో పాలకవర్గ సభ్యుల పదవీ కాలం ముగిసిపోయింది. కొత్త పాలకవర్గం కొలువుదీరే వరకు అధికారుల పాలన కొనసాగనుంది. హుస్నాబాద్ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ బాధ్యతలు స్వీకరించారు. తొందరలోనే చెత్తపై యూజర్ చార్జీల వసూలు చేసే విషయంపై నిర్ణయం తీసుకొని అమలు చేసే కార్యాచరణ రూపొందించనున్నారు.



మున్సిపల్ కార్యాలయ భవనం

ఆ ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది



చెత్త సేకరణపై యూజర్ చార్జీలు వసూలు చేయాలని ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సాలిడ్ వేస్ట్ రూల్ ప్రకారం యూజర్ చార్జీలు వసూలు చేయాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. చాలా మున్సిపాలిటీల్లో చెత్త సేకరణపై యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఈనెల 26న జరిగిన మున్సిపల్ పాలకవర్గం సమావేశంలో యూజర్ చార్జీలు వసూలు చేసే ప్రతిపాదనను ప్రవేశపెట్టాం. మున్సిపల్ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ దృష్టికి తీసుకెళతాం. చర్చించిన తర్వాత స్పష్టత వస్తుంది.
- మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

చట్టాలపై అవగాహన తప్పనిసరి

డిస్ట్రిక్ లీగల్ అథారిటీ సర్వీసెస్ సెక్రటరీ స్వాతిరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): చట్టాలు తెలుసుకుంటే సమస్య త్వరగా పరిష్కరించుకోవచ్చని డిస్ట్రిక్ లీగల్ అథారిటీ సర్వీసెస్ సెక్రటరీ స్వాతిరెడ్డి అన్నారు. మంగళవారం నర్మేట కస్తూర్బా గాంధీ పాఠశాలలో చట్టపరంగా పొందే హక్కులు, బాధ్యతలు, న్యాయ సలహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతిరెడ్డి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ఉంటే నేరాలు చేయడానికి భయపడతారని, దీంతో సమాజం శాంతియుతంగా ఉంటుందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, చెడువ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మహిళా చట్టాలు, షీ-టీమ్, పోక్సో, ర్యాగింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆసిఫ్, సీనియర్ న్యాయవాది సాదుల ఆత్మరాములు, స్పెషలాఫీసర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న స్వాతిరెడ్డి

క్రీడోత్సవ్



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేలో భారత్ క్రీడోత్సవ్ మంగళవారం నిర్వహించారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్లో క్రీడా పోటీలు జరుగుతున్నాయి. అందులో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో 15 టీమ్స్ పాల్గొన్నాయి. విద్యార్థుల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఫణిందర్ అన్నారు. - దుబ్బాకటౌన్

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు మై భారత్-నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడువ్యసనాలకు బానిసలు కావద్దని, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుల్లో రాణించాలని సీఐ అన్నారు. పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారన్నారు. వారి కలలను నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల నివారణ, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి రంజిత్‌రెడ్డి, సిద్దిపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్, నషాముక్త్ భారత్ అభియాన్ జిల్లా కమ్యూనిటీ ఎడ్యుకేటర్ మురళి, ఎస్‌వైకే జిల్లా ప్రోగ్రాం అధికారి కిరణ్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, రోటరీ క్లబ్ సభ్యులు చంటి, యువజన సంఘాల ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ మురళి

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

- పశువైద్య సంచార వాహన సిబ్బంది
- కుటుంబపోషణకు అప్పులు చేస్తున్నామని ఆవేదన

గజ్వేల్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చొరవ చూపాలని పశువైద్య సంచార వాహన (1962) సిబ్బంది ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో మూగ జీవాలు, పశువులకు (1962 సంచార వైద్యశాల) అంబులెన్స్ ద్వారా ఉచిత వైద్య సేవలందిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక అంబులెన్స్‌లో నిత్యం వెటర్నరీ డాక్టర్, ప్యారవెట్, డ్రైవర్, అటెండర్‌లు విధులు నిర్వహిస్తున్నారని, ఐదు నెలలుగా నిధులు విడుదల కాకపోవడం, సకాలంలో అందకపోవడంతో దుర్భర పరిస్థితులను గడుపుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో ఇంటి అద్దెలు, పిల్లల చదువులకు అప్పులు చేయాల్సి వస్తుందని వాపోయారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపి పెండింగ్ వేతనాలు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఆయిల్‌పామ్‌తో స్థిరమైన ఆదాయం

మిరుదొడ్డి(దుబ్బాక): ఆయిల్ పామ్ తోటల్లో గెలలు కోతకు రావడంతో రైతులు తప్పకుండా యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆయిల్ ఫెడ్ మానిటరింగ్ ఆఫీసర్ విజయ్ రైతులకు సూచించారు. మండలంలోని చెప్యాలలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 11 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగవుతున్నాయన్నారు. గెలలు కోతకు వచ్చే సమయంలో రైతులు సాగు నీరు, ఎరువులను సకాలంలో అందిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కోతకు వచ్చిన ఆయిల్‌పామ్ గెలలకు తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించామన్నారు. సాగు చేస్తున్న తోటల్లో మొక్కజొన్న, వేరుశనగ, పప్పు ధాన్యాలను అంతర పంటలుగా సాగు చేసుకుంటూ మరింత ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ఆంజనేయులు, రైతులు నంద్యాల దయాకర్‌రెడ్డి, అందె రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్‌లో అధికారులు

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

సిద్దిపేట టూటౌన్ ఎస్‌ఐ రాజేశం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రమాదాల నివారణ మనందరి బాధ్యత అని సిద్దిపేట టూటౌన్ ఎస్‌ఐ రాజేశం అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం పోలీస్ సిబ్బందితో కలిసి ఆయన పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఆటో డ్రైవర్లకు, యువకులకు, ప్రజలకు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన నిర్వహించారు. రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల వాహనదారులు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, త్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లతో ప్రమాదన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, మైనర్ వాహనాలను నడపడం ద్వారా అనేక ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. వాహన చోదకులు జాగ్రత్తలు పాటించడం ద్వారా అధికంగా ప్రమాదాలను నివారించినవారమవుతామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎంపిక

సిద్దిపేటకమాన్: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా 32 ఏళ్ల పాటు విధులు నిర్వహించి ప్రమాద రహిత డ్రైవర్లుగా సిద్దిపేట ఆర్టీసీ డిపోకు చెందిన బిఎస్‌రెడ్డి, ఎస్ వెంకటయ్య ఎంపికయ్యారని సిద్దిపేట ఆర్టీసీ డీఎం సుఖేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. బుధవారం రీజినల్ మేనేజర్ ప్రభులత చేతుల మీదుగా సన్మానం నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని సూచించారు.

◆ ఉత్తమ డ్రైవర్లకు సన్మానం



హుస్నాబాద్: ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్లను మంగళవారం సన్మానించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కరీంనగర్ రీజియన్ పరిధిలో ఉన్న హుస్నాబాద్ డిపో ఉత్తమ డ్రైవర్లు బి.ఎల్లయ్య, ఎస్.ఆర్ కృష్ణ, ఎల్.కొమురయ్యలను ఆర్‌ఎం సమక్షంలో సన్మానించారు. ఆపై ప్రశంసా పత్రాలు అందజేసి శాలువాలతో సత్కరించారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 11 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో మంగళవారం హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.17వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ జాతరకు సిద్ధం

మిరుదొడ్డి(దుబ్బాక): మాఘ అమావాస్య సందర్భంగా మిరుదొడ్డి శివారులోని కూడవెల్లి వాగు ఒడ్డున బుధవారం జరిగే సీతారామాంజనేయ జాతర మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం కూడవెల్లి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులతో కలిసి జాతర ఏర్పాట్లను ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు దుర్గారెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అప్పన్‌కందాడై రాజగోపాలాచారి, పార్థసారధి, అంజిరెడ్డి, లాల్‌గారి గొల్ల రాములు, కుంట నారాయణ, నాగరాజు, మల్లేశం, ఎల్లయ్య, మంకయ్య, పర్వరాములు, అంజయ్య, మల్లయ్య, రవి, బాలమల్లు, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

◆ భవనం పరిశీలన

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ఏర్పాటు కోసం మంగళవారం గ్రామంలోని వివిధ ప్రభుత్వ భవనాలను ఉమ్మడి మండల ఎంపీడీఓ రామ్మోహన్ పరిశీలించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఇందుకు అనువుగా ఉంటుందని ఉన్నతాధికారులకు నివేదించారు. నేడు గ్రామ సభ నిర్వహించి ఈ కార్యాలయం భవనాన్ని అప్పగిస్తామన్నారు. ఇటీవల దూళ్మిట్ట మండలానికి మండల పరిషత్ కార్యాలయం కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం విదితమే.

◆ పథకాలు సద్వినియోగం చేసుకోండి

దుబ్బాకటౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణానికి చెందిన ఎం.సాయమ్మ ఇటీవల అనారోగ్యానికి గురికాగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా చెక్కు మంజూరైంది. దీంతో పార్టీ నాయకులు రూ.33 వేల చెక్కును అందించారు.

◆ రాష్ట్ర మహాసభలకు తరలిరండి

చిన్నకోడూరు(సిద్దిపేట): తెలంగాణ కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘం రాష్ట్ర ద్వితీయ మహాసభలను కార్మికులు పెద్ద సఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దం రాజిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో నిర్వహించే ఈ మహాసభలకు రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్, జాతీయ ఉపాధ్యక్షుడు సుబ్బారావు, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజులు హాజరవుతారని తెలిపారు. కార్మిక నేతలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

యేటా ఒక రోజే..

- మాఘ అమావాస్య నాడే దత్తాత్రేయుడి దర్శనం
- పునఃదర్శనం కోసం మరో ఏడాది సమయం
- నేటి నుంచే జాతర



శ్రీవారి నామం ఆకారంలో ఉన్న కొలను



ఆలయంలో వెలసిన దత్తాత్రేయుడు

నంగునూరు(సిద్దిపేట): మాఘ అమావాస్య రోజున పాలమాకులలో జరిగే బండమీది జాతరకు దత్తాత్రేయుడి ఆలయం ముస్తాబైంది. పాలమాకుల, రాజగోపాల్‌పేట, వెంకటాపూర్, ముండ్రాయి గ్రామాల శివారులో ఉన్న ఆలయాన్ని సంవత్సరానికి ఒకరోజు మాత్రమే తెరిచి సాయంత్రం మూసివేయడం ప్రత్యేకత. ఆలయ ప్రాంగణంలో హరి నామం ఆకారంలో వెలసిన పవిత్ర గుండంలో స్నానం చేసి, స్వామిని దర్శనం చేసుకుంటే పీడ బాధలు తొలుగుతాయని గ్రామస్తుల నమ్మకం. ఈ క్రమంలో బుధవారం జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ధర్మకర్తలు చీకోటి వంశస్తులు గ్రామస్తులు తెలిపారు. వేల సంవత్సరాల కిందట మునుల బండపై దత్తాత్రేయుని ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ధర్మకర్తలు నాటి నుంచి నేటి వరకు యేటా మాఘ అమావాస్య రోజున ఉదయాన్నే గుడి తెరిచి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యం సమర్పించడంతో జాతర ప్రారంభమవుతోంది. చీకటి పడగానే పూజలు నిర్వహించి ఆలయాన్ని మూసివేస్తారు.